క్లుప్తంగా

గుండిపాలలో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు చేస్తున్న దృశ్యం

గొలుగొండ: గుండిపాలలో పారిశుధ్య పనులు నిర్వహించారు. సర్పంచ్ జాగు రాము, కార్యదర్శి కుమార్‌ల ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడ పనులు ప్రారంభించారు. గ్రామ కాలువల్లో పూడిక తొలగింపుతోపాటు తాగునీటి, కుళాయిల వద్ద శుభ్రం చేయించారు. వీధి రోడ్ల పక్కనే చెత్తను సైతం తొలగింపు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, కార్యదర్శి మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికి ప్రజల సహకారం కూడా ఉండాలని కోరారు.

ఉల్లాసంగా పూర్వ విద్యార్థుల కలయిక



ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మాకవరపాలెం: పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఉల్లాసంగా సాగింది. మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో 1976–77 ఏడాదిలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం స్థానిక శ్రీకన్య ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. దీనికి వివిధ ప్రాంతాల్లోని పూర్వ విద్యార్థులు హాజరై ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. 48 ఏళ్ల అనంతరం ఒకే వేదికపై కలుసుకున్న వీరంతా ఒకరికొకరు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ సమ్మేళనంలో 30 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్త నమూనాల సేకరణ



విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న ఏఎన్ఎం సత్యవతి

రోలుగుంట: స్థానిక జూనియర్ కళాశాలలో సోమవారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో రక్త నమూనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా 160 మంది విద్యార్థులకు ఏఎన్ఎం జి.సత్యవతి రక్తనమూనాలు సేకరించారు. వీరిలో అయిదుగురికి రక్త శాతం తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. వారిలో రక్తశాతం పెరుగుదలకు సంబంధించిన ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. తీసుకోవాల్సిన ఆహారంపై పలు సూచనలు చేశారు.

చోడవరం ఎంఈవోగా సత్యనారాయణ



ఎంఈవోను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

చోడవరం రూరల్: ఎంఈవో–1గా కుబిరెడ్డి సత్యనారాయణ పూర్తి అదనపు బాధ్యతలను స్వీకరించారు. గత నెలాఖరు వరకు ఎంఈవో–1గా బాధ్యతలు నిర్వహించిన ఎన్.జయలక్ష్మి ఉద్యోగ విరమణ చేయగా, ఆ స్థానం ఖాళీ అయ్యింది. కె.కోటపాడు ఎంఈవో చేస్తున్న సత్యనారాయణకు చోడవరం బాధ్యతలను అప్పగిస్తూ విద్యాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఏపీటీఎఫ్ నాయకులు మహాలక్ష్మినాయుడుతోపాటు ఉపాధ్యాయ నాయకులు, ఉపాధ్యాయులు కలిసి అభినందించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 120 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,200	4,900
రెండో రకం	3,810	4,180
మూడోరకం	3,190	3,300

ముమ్మరంగా వరినాట్లు

- తాండవ ప్రాజెక్టు నీరు విడుదలకు ముందే దమ్ము పనులు
- దమ్ము ట్రాక్టర్లు, కూలీల డిమాండ్ గ్రహించిన ఆయకట్టుదారులు
- నిమ్మకట్టు ఆనకట్ట, చెరువులు, బోర్ల నీటితో నాట్లు



ట్రాక్టరుతో దమ్ము చేస్తున్న రైతు



వరినాట్లు వేస్తున్న మహిళలు



వరినారు తీస్తున్న కూలీలు

నాతవరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులందరూ ఒకేసారి వరినాట్లు వేస్తే కూలీల కొరత ఏర్పడుతోంది. ఈ సమస్యను గుర్తించిన కొంతమంది రైతులు ముందుగానే వరినాట్లు వేస్తున్నారు. తాండవ రిజర్వాయరు నుంచి నీటిని ఆయకట్టుకు విడుదల చేయకపోయినప్పటికీ చెరువులు, నిమ్మకట్టు ఆనకట్ట, బోర్ల నీటితోపాటు అడపా దడపా కురుస్తున్న వర్షపు నీటితో వరినాట్లు వేసుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండల వ్యాప్తంగా చెరువుల్లో పుష్కలంగా నీటి నిల్వలు ఉన్నాయి. ప్రధానంగా రాజుపేట అగ్రహారం సమీపంలో నిమ్మకట్టు ఆనకట్ట ఉండటంతో ఇందులో నిత్యం నీరు పుష్కలంగా ఉంటోంది. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మండలంలో 825పైగా విద్యుత్ బోర్లు ఏర్పాటు చేశారు. నిమ్మకట్టులో నీరు బోర్ల సాయంతో రైతులు వరినాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. గతంలో తాండవ రిజర్వాయరు నుంచి ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు నీరు విడుదల చేస్తేనే అధికంగా రైతులు వరినాట్లు వేసేవారు. తాండవ ఆయకట్టు పరిధిలో అంతా ఒకేసారి వరినాట్లు వేయడంతో దమ్ముపట్టే ట్రాక్టర్లు కూలీలకు ఊహించని విధంగా డిమాండ్ ఏర్పడుతుంది. దీంతో కూలీల సమస్య విపరీతంగా ఏర్పడటం వల్ల పనులకు రెట్టింపు కూలి పెంచేస్తున్నారు. ఇదీ గమనించిన రైతులు ఇటీవల తాండవ రిజర్వాయరు నుంచి నీరు విడుదల చేసేంత వరకు ఉండకుండా బోర్లు, చెరువులు నిమ్మకట్టు నీటితో వరినాట్లు వేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది 22 వేల ఎకరాల వరకు ఖరీఫ్ వరినాట్లు వేస్తారని అధికారులు అంచనా వేశారు. తాండవ రిజర్వాయరు నీటితో ప్రమేయం లేకుండా ప్రస్తుతం మూడు వేల ఎకరాలకు పైగా తాండవ ఆయకట్టు పరిధిలో వరినాట్లు వేశారు. తాండవ రిజర్వాయరు నీటిని త్వరలో విడుదల చేస్తే మెట్ట ప్రాంత భూములు శివారు ఆయకట్టులో వరినాట్లు వేసుకుంటారు. ముందుగా వరినాట్లు వేయడం వల్ల దమ్ముచేసే ట్రాక్టర్లు వరినాట్లు వేసే కూలీలకు గిరాకీ తగ్గుతుందని రైతులు చెబుతున్నారు.

జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు



ఖరీఫ్ సీజన్‌లో వరినాట్లు వేసే రైతులంతా మేము చెప్పినట్లుగా తగు జాగ్రత్తలు పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తారు. పంటకు తెగుళ్ల రాకుండా కాపాడుకోవచ్చు. చాలా మంది రైతులు సరైన అవగాహన లేకుండా దమ్ము లో వరినాట్లు వేసేటప్పుడు కలుపు తీత సమయంలో ఇష్టానుసారంగా ఎరువులు వేస్తున్నారు. అలా చేయడం వల్ల చేనుకు తెగుళ్ల వ్యాపిస్తాయి. గతంలో మేము చెప్పినట్లుగా కొంత మంది రైతులు వరినారు వేసిన దగ్గర్నుంచి సూచనలు పాటించి మేలు పొందారు.

– శైలజ, వ్యవసాయాధికారి, నాతవరం మండలం

సంఘ అర్హతను బట్టి రుణ మంజూరు



రుణ మంజూరుపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు మేనేజర్ పరమేశ్వర్రావు

రోలుగుంట: ప్రతి సభ్యురాలు పేరున బ్యాంకు ఖాతా తెరచి కొన్ని నెలలపాటు పొదుపు కట్టాలని, ఆ తర్వాత సంఘ అర్హతను బట్టి రుణాలు మంజూరు చేస్తామని స్థానిక ఏపీజీవీబీ బ్రాంచి మేనేజర్ పి.పరమేశ్వర్రావు తెలిపారు. స్థానిక బ్రాంచ్ ఆఫీసులో డ్వాక్రా సంఘాల ఏర్పాటు, రుణాలు మంజూరుపై సభ్యులకు అవగాహన కల్పించారు. కొండపాలెం శివారు వెలంకాయలపాలెంలో కొత్తగా ఏర్పాటైన డ్వాక్రా సభ్యులు, వెలుగు ప్రతినిధులు భవాని, నాగేశ్వరరావు బ్రాంచి మేనేజరును సోమవారం కలిశారు. వారి వివరాలు బ్రాంచి మేనేజరు కంప్యూటర్లో నమోదు చేసుకున్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం



మాడుగులలో ర్యాలీ నిర్వహిస్తున్న మాల మహానాడు

మాడుగుల: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేక పోరాటానికి మాల మహానాడు సిద్ధంగా ఉందని, ఆ సంఘ సభ్యులు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక బస్టాండ్ నుంచి ఎస్సీ వర్గీకరణ వద్దు.. ఐక్యతే ముద్దు.. అనే నినాదాలతో ర్యాలీగా తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని, అక్కడ డీటీ లక్ష్మయ్యకు వినతి పత్రం అందజేశారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని కోరారు. మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనువాసరావు, జిల్లా కార్యదర్శి తమ్మెల ఈశ్వరరావు, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనువాస్, జల్లా ఉపాధ్యక్షుడు మరువాడ ఈశ్వరరావు, కేజేపురం సర్పంచ్ జామి రమణబాబు, కుదర నాగేశ్వరరావు, తాడి సాగర్, పెట్లా ఈశ్వరరావు, పెట్లా భీమేష్, మానస పరమేష్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ



తూటిపాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మాకవరపాలెం: మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ సోమవారం తూటిపాలంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. నాషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాము మాట్లాడుతూ దేశానికి యువతే ఒక శక్తి అని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. వాటి వల్ల యువత జీవితం నాశనం అవుతుందన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. పంచాయతీ కార్యదర్శి బాబూరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలతో ఆదాయం



వీధుల్లో డ్రైనేజీలను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాల నిర్వహణతో పంచాయతీలకు ఆదాయం వస్తుందని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. మర్రిపాలెం, నాతవరం, గన్నవరం పంచాయతీల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఆయా పంచాయతీల్లో పారిశుధ్య పనులను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. స్థానిక చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాలను పరిశీలించారు. వానపాములు విడుదల చేసి సేంద్రియ ఎరువులను తయారీ చేయాలన్నారు. సేంద్రియ ఎరువులు విక్రయాల ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుందన్న విషయాన్ని కార్యదర్శి, పంచాయతీ పాలక వర్గం సంయుక్తంగా ఆలోచన చేయాలన్నారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త సేకరించేందుకు గతంలో గ్రామాల్లో ప్రజలకు డస్ట్‌బిన్లు పంపిణీ చేశామన్నారు. వర్షాకాలంలో రోగాలు వ్యాపించకుండా తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయాలన్నారు.

ఉత్సాహంగా పంద్రాగస్టు పోటీలు



కె.జె.పురం హైస్కూలులో క్రికెట్ ఆడుతున్న విద్యార్థులు

మాడుగుల రూరల్: స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకుని పాఠశాలల్లో సోమవారం నుంచి క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. కె.జె.పురం హైస్కూలులో కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బాలికలకు షిప్పింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ల ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు పర్యవేక్షణలో ఈ పోటీలు నిర్వహించారు. విజేతలకు 15న బహుమతులు ప్రదానం చేస్తామని వారు తెలిపారు.

గ్రంథాలయ పితామహుడికి ఘన నివాళి



రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న లైబ్రేరియన్ దమయంతి తదితరులు

నర్సీపట్నం: గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాధన్ జయంతిని స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయ అధికారి పి.దమయంతి, విశ్రాంత లైబ్రేరియన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగనాధన్ సేవానిరతిని కొనియాడారు. ఈనాటి తరానికి రంగనాధన్ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నేటికి గ్రంథాలయాలకు ఎంతో ఆదరణ ఉందన్నారు. గొలుగొండ, రోలుగుంట లైబ్రేరియన్లు రాజుబాబు, ఎస్.వరలక్ష్మి, చంద్రమౌళి పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

లైబ్రేరియన్ పితామహుడు రంగనాధన్ 133 జయంతిని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టరు ఎస్.రాజు, అధ్యాపకులు రంగనాధన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రెవెన్యూ సమస్యలపై నిర్లక్ష్యం చేయొద్దు



తహసీల్దార్ శ్రీనివాసనాయుడు

నాతవరం: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. ఆయన సోమవారం తన సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. రైతుల ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దన్నారు. అర్హత ఉన్న కౌలు దారులకు కార్డులు సకాలంలో అందించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి జారీ చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రైతుల ఎఫ్‌లైన్ సర్వే చేసేటప్పుడు సచివాలయ సర్వేయర్లు అంకితభావంతో పని చేయాలన్నారు. కొంతమంది సర్వేయర్లు పనితీరుపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాంటి వారిలో మార్పు రావాలని, లేకుంటే తీసుకునే చర్యలకు బాధ్యుల వుతారన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ భూములు, గెడ్డ పోరంబోకు ఆక్రమణ గురైయితే వాటిపై బాధ్యత వీఆర్వోలదేన్నారు. ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్నందున సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ఎస్.సురేష్, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, ఆర్ఐ హరి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీకి విశేష స్పందన



వ్యాసరచనలో నిమగ్నమైన విద్యార్థులు

చోడవరం రూరల్: పంద్రాగస్టు సందర్భంగా స్థానిక ప్రేమ సమాజంలో సోమవారం వ్యాసరచన పోటీకి విశేష స్పందన వచ్చింది. పలు విద్యా సంస్థలకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొని వ్యాసరచనా పటిమను వ్యక్తీకరించారు. స్వాతంత్య్ర పోరాట యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితంపై ఈ పోటీ నిర్వహించారు. విజేతలకు ఈ నెల 15న ప్రేమ సమాజం భవనం నుంచి కొత్తూరు జంక్షన్ వరకు నిర్వహించే తిరంగా పతాక ర్యాలీ అనంతరం సభలో బహుమతులను అందజేస్తామని నిర్వాహకుడు ప్రసాదరాజు తెలిపారు.

గోకులం షెడ్ల ఏర్పాటుకు దరఖాస్తులు

మాడుగుల: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 25 గోకులం షెడ్ల మంజూరు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు తెలిపారు. ఈ పథకంలో పశువుల షెడ్లకు 90 శాతం రాయితీ, గొర్రెలు, కోళ్ల షెడ్లకు 70 శాతం రాయితీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. అర్హత కలిగిన రైతులు దరఖాస్తుకు ఆధార్ కార్డు, ఉపాధి పని పుస్తకం, షెడ్లు నిర్మించే స్థలం వన్‌బీ, రెండు ఫొటోలు, రేషన్‌కార్డు జెరాక్స్, సంబంధిత అధికారుల ధ్రువీకరణ పత్రం, గ్రామసభ తీర్మానాలు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, ఆర్థికంగా వెనుకబడిన వారు అర్హులన్నారు. పూర్తి వివరాలకు పశు వైద్యశాలను సంప్రదించాలని తెలిపారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజు

నర్సీపట్నం: అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి సౌజన్యంతో సమీద స్వచ్ఛంద సంస్థ వారు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టరు ఎస్.రాజు మాట్లాడుతూ లైంగికంగా ఎయిడ్స్ సక్రమిస్తుందన్నారు. విద్యార్థులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎస్సై సుధాకర్, ఎం.కె.రామచంద్రరావు, డి.ఎస్.ఆర్.సి. కౌన్సిలర్ గణపతి, ఎ.ఆర్.టి. కౌన్సిలర్ ప్రసాద్, ఐ.సి.టి.సి. కౌన్సిలర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయం



డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తామని ప్రమాణం చేయిస్తున్న పెద్దలు



దేవరాపల్లిలో అవగాహన కల్పిస్తున్న సచివాలయ అధికార్లు రత్నం, మీరాబి

చోడవరం రూరల్: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా యువత పట్టుదలతో కృషి చేయాలని చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ మెంబర్‌షిప్ చైర్‌పర్సన్ కాండ్రేగుల డేవిడ్ ఆకాంక్షించారు. సోమవారం లయన్స్ క్లబ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో యువజన దినోత్సవంలో భాగంగా యాంటీ డ్రగ్స్ డే సదస్సును నిర్వహించారు. క్లబ్ సర్వీసెస్ చైర్‌పర్సన్ ముక్కా రమేష్ పర్యవేక్షణలో జరిగిన సదస్సులో డేవిడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ఉమారాణి, ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కిరణ్మణీశ్వరి, చోడవరం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ వినయ్‌కుమార్, ఆర్స్ సంస్థ కార్యదర్శి డి.ఎస్.ప్రసాద్, ఫారెస్ట్ రేంజర్ బి.గౌరీష్ మాట్లాడుతూ మత్తు కారణంగా జీవితంలో ఉన్నతంగా ఎదగాల్సి వారు ఏ రీతిలో అభాసుపాలై, అట్టడుగుకు చేరిపోతారో సోదాహరణంగా విద్యార్థులకు విడమరచి చెప్పారు. లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పసుమర్తి సాంబశివరావు, కళాశాల పీడీ గోతిరెడ్డి రాంబాబు విద్యార్థులతో ప్రమాణం చేయించారు. విద్యార్థులందరికీ మొక్కలను సరఫరా చేస్తామ ని సోషల్ ఫారెస్టు రేంజర్ తెలిపారు. నర్సయ్యపేట సర్పంచ్ ఉగ్గిన నాగబాబు, పిందిరి శ్రీను, ఆర్.సతీష్‌వర్మ, కటకం దీపక్, లయన్స్ కార్యదర్శి వర్ముల వీర వెంకట రమణమూర్తి(బాబు) పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గొలుగొండ: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చదువుపై శ్రద్ధ చూపి మంచి భవిష్యత్ ఎంచుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీహరి తెలిపారు. సోమవారం ఏఎల్‌పురం కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టంపై అవగాహన కల్పించారు. యువత మంచి మార్గంలో నడిచి ఇంటికి, ఊరుకి, కళాశాలకు మంచి పేరు తీసుకోవాలని కోరారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి

దేవరాపల్లి: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దామని దేవరాపల్లి సచివాలయం–2 సెక్రటరీ రత్నం, గ్రామ సచివాలయ మహిళా సంరక్షణ అధికారి ఎస్.కె. మీరాబి అన్నారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగసాములు కావాలని ప్రతిజ్ఞ చేయించారు.

మండల, డివిజన్ స్థాయిలో పని సర్దుబాటు



బుచ్చెయ్యపేటలో ఎంఈవోకి వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు



మాడుగుల రూరల్: ఎంఈవోలకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

బుచ్చెయ్యపేట: ఉపాధ్యాయుల పని సర్దుబాటులో పలు సూచనలు పాటించాలని ఏపీటీఎఫ్ మండల నాయకులు ధర్మారావు, దుర్గా ప్రసాద్ ఎంఈవోకు వినతి పత్రం అందించారు. జీవో నంబర్ 117, 128 ద్వారా కాకుండా 2020లో విడుదల చేసిన జీవో 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలన్నారు. సీనియర్ ఉపాధ్యాయులకు విల్లింగ్ కల్పించడంతో పాటు ప్యానెల్ నంబర్‌ను లేదా ర్యాంకును పరిగణనలోకి తీసుకోవాలని, పని సర్దుబాటు మండల, డివిజన్ స్థాయిలోనే జరగాలని, 70 శాతం పైబడి వైకల్యం ఉన్న ఉపాధ్యాయులకు పని సర్దుబాటు నుంచి మినహాయించాలన్నారు. 2025 ఏప్రిల్ 30వ తేదీ లోపు పదవీ విరమణ చేసే ఉపాధ్యాయులకు పని సర్దుబాటు నుంచి తప్పించాలని తదితర డిమాండ్లను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. పని సర్దుబాటును బాయ్‌కాట్ చేస్తున్నట్లు డీఈవోకు వినతి పత్రం అందించినట్లు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ పి. చిన్నబ్బాయి తెలిపారు.

మాడుగుల రూరల్: ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన జీవో 117 రద్దు చేసిన తర్వాత సర్దుబాటు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు (ఫ్యాప్టో) సోమవారం సాయంత్రం ఎంఈవోలు దేముడమ్మ, పాండురంగారావులకు బాయ్‌కాట్ నోటీసు అందజేశారు. 117 జీవోను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ మండల నాయకులు శివకుమార్, బంగారయ్య, పీఆర్టీయూ నాయకులు ఆనందరావు పాల్గొన్నారు. జీవో ప్రకారం 98 కంటే ఎక్కువ పిల్లలు ఉన్న పాఠశాలల్లో స్కూలు అసిస్టెంట్లతో బోధన జరిపి, 98 మంది పిల్లలను కంటే తక్కువ రోలు ఉన్న యూపీ స్కూలు, లేదా హైస్కూలులో ఎస్జీటీలు బోధన జరపడం ఎంతవరకు సమంజసమని, పునరాలోచన చేసి ప్రతి యూపీ స్కూలుకు రోల్‌తో సంబంధం లేకుండా కొంత మంది స్కూలు అసిస్టెంటును కేటాయించాల్సించాలని వారు కోరారు.

నాటు తుపాకీతో ఇద్దరు అరెస్ట్

బుచ్చెయ్యపేట : మండలంలో కొమళ్లపూడి గ్రామంలో లైసెన్స్ లేకుండా నాటు తుపాకీ వాడుతున్న దాసరి సత్యారావును అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఈ నెల 11వ తేదీన కొమళ్లపూడి కొండల వద్ద నాటు తుపాకీతో వెళ్తున్న సత్యారావును అదుపులోకి తీసుకుని తుపాకీ ఎక్కడిదని విచారించామన్నారు. విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం గొల్జాం గ్రామానికి చెందిన ముసిన సత్యనారాయణ వద్ద రూ.800కు కొనుగోలు చేసినట్టు తెలిపాడన్నారు. దీంతో గొల్జాంలో ఉన్న సత్యనారాయణను అదుపులోకి తీసుకుని దాసరి సత్యారావు వద్ద ఉన్న గంధకం, నల్లబొగ్గు, గన్ పౌడర్, సైకిల్ బాల్స్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసి సోమవారం అనకాపల్లి కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

దిబ్బిడిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



విద్యుత్ వైర్లను సరి చేయిస్తున్న సిబ్బంది

బుచ్చెయ్యపేట: దిబ్బిడి గ్రామంలో వంక చెరువు వద్ద విద్యుత్ మోటార్లకు సరఫరా పునరుద్ధరణ చేసినట్లు వడ్డాది విద్యుత్ శాఖ ఏఈ రాజు తెలిపారు. వారం రోజుల క్రితం వీచిన గాలికి చెట్టు విద్యుత్ తీగలపై పడటంతో తెగిపోయాయన్నారు. తెగి పడిన విద్యుత్ తీగలను సోమవారం బిగించి రైతుల మోటార్లకు సరఫరా పునరుద్ధరించామని ఏఈ తెలిపారు.